ప్రజాశక్తి
గురువారం 6 జులై 2023
5
శ్రీకాకుళం

అరకొరగానే జగనన్న కిట్‌లు

- విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని విద్యా కానుక
- ఐదు మండలాల్లో ఒక్కరికీ అందని బెల్టులు
- అసంపూర్ణంగానే బూట్ల పంపిణీ
- సకాలంలో చెల్లించని కుట్టు కూలి ఛార్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గత నెల 11వ తేదీన పాఠశాలలను తెరిచిన సంగతి తెలిసిందే. జూలై వచ్చినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చాలామందికి బెల్టులు, బూట్లు, యూనిఫాం అందలేదు. జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలు కలిపి 2,656 ఉన్నాయి. ఇందులో1,91,394 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు 1,11,417 మందికి కిట్లు అందాయి. ఇంకా 79,977 మందికి అందలేదు. జిల్లాలో 1,34,629 మందికి బెల్టులు పంపిణీ చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 1,06,668 బెల్టులు ఇచ్చారు. 1,91,394 మందికి బ్యాగులు అందించాల్సి ఉండగా 1,90,087 మందికి పంపిణీ చేశారు. నోటు పుస్తకాలు దాదాపుగా జిల్లాకు కావాల్సిన మేర వచ్చాయి. 11,65,038 పుస్తకాలు అవసరం కాగా 11,64,960 పుస్తకాలను విద్యార్థులకు ఇచ్చారు. కేవలం 78 పుస్తకాలు మాత్రమే కొరత ఉంది. విద్యార్థులకు అవసరమైన బూట్లలో ఇప్పటివరకు 1,87,867 అందించగా 3,926 మందికి ఇచ్చారు. అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు జిల్లాకు రావాల్సిన యూనిఫాం వచ్చాయి. జిల్లాకు 1,91,394 మందికి దుస్తులు అవసరం కాగా, ఇప్పటివరకు 1,90,962 మందికి అందించారు. మరో 432 మందికి అందించాల్సి ఉంది. విద్యార్థులకు 35,320 డిక్షనరీలు అవసరం కాగా పూర్తిస్థాయిలో వచ్చాయి.

ఐదు మండలాల్లో ఒక్కరికీ అందని బెల్టులు

జిల్లాలో విద్యార్థులకు అవసరమైన బెల్టుల కొరత తీవ్రంగా ఉంది. పలు మండలాల్లో కనీసం ఒక్కటీ రాలేదు. ఆ జాబితాలో ఎచ్చెర్ల, గార, లావేరు, పొందూరు, శ్రీకాకుళం మండలాలు ఉన్నాయి. ఇక్కడి విద్యార్థులెవరికీ బెల్టులు అందించలేదు. జలుమూరులో 72 మందికి, వజ్రపుకొత్తూరులో ఎనిమిది మందికి ఇవ్వలేదు. బ్యాగుల పంపిణీ అసంపూర్ణంగానే జరిగింది.

పాఠశాలల ప్రారంభం రోజునే పిల్లలకు పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బెల్టులు తదితర వస్తువులతో కూడిన జెవికె కిట్‌లను అందజేసినట్లు ప్రభుత్వం చెప్పినా, క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. పాఠశాలలు తెరిచి మూడు వారాలు దాటినా జగనన్న విద్యా కానుకల అరకొరగానే పంపిణీ అయింది. బెల్టుల కొరత తీవ్రంగానే ఉంది. మరోవైపు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాల కొరత కూడా ఉంది. తొమ్మిది, పదో తరగతి చదివే ఇంగ్లీష్ మీడియం విద్యార్థులకు బయాలజీ పుస్తకాల కొరత ఉంది. మరోవైపు యూనిఫాం కుట్టు కూలి డబ్బులనూ ప్రభుత్వం సకాలంలో జమ చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జి.సిగడాంలో 273 మందికి, ఎచ్చెర్లలో 12 మందికి, గారలో ఇద్దరికి, కంచిలిలో 83 మందికి ఇవ్వలేదు. కొత్తూరులో 67 మందికి, మందసలో 212 మందికి, పలాసలో 40 మందికి, పాతపట్నంలో ఆరుగురికి, పొందూరులో 582 మందికి బ్యాగులు అందలేదు.

బూట్లూ కొరతే

బూట్ల పంపిణీ కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. ఎచ్చెర్లలో 107, జి.సిగడాంలో 239, ఇచ్ఛాపురంలో 355, జలుమూరులో 427 మందికి ఇవ్వలేదు. కంచిలిలో 29, కవిటిలో 185, మందసలో 292, మెళియాపుట్టిలో 60 మందికి అందించలేదు. నరసన్నపేటలో 680, పలాసలో 122 రణస్థలంలో 664 మందికి బూట్లు ఇవ్వలేదు. సోంపేటో 372 మందికి, శ్రీకాకుళంలో 109 మందికి అందించలేదు.

అందని కుట్టు కూలి ఛార్జీలు

యూనిఫాం దుస్తుల తయారీని గతంలో ఏజెన్సీలకు అప్పగించేవారు. తల్లిదండ్రులు తమకు నచ్చిన రీతిలో బట్టలు కుటించుకోవాలని రెండేళ్లుగా వారికే కుట్టు కూలి ఛార్జీలను చెల్లిస్తోంది. తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు మూడు జతలకు రూ.240, ఆలోపు పిల్లలకు రూ.180 వంతున తల్లుల ఖాతాలో జమ చేస్తామని చెప్పినా ఆ మేరకు డబ్బులు పడలేదు. ప్రభుత్వం ఇచ్చేదే తక్కువ, అవీ సకాలంలో ఇవ్వకపోవడంతో తల్లిదండ్రుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది.

విద్యాశాఖ కార్యదర్శి ఆరా

జగనన్న విద్యా కానుక కింద బ్యాగులు, బూట్లు అందుతున్నాయా? లేదా? అన్న విషయంపై విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అప్పుడే ఆరా తీయడం మొదలు పెట్టారు. ఈనెల నాలుగో తేదీన ఆయన కార్యాలయం నుంచి నేరుగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆరా తీస్తున్నారు. బూట్లు, బ్యాగులు ఇచ్చారా? లేదా?, బ్యాగులు పాతవి వాడుతున్నారా, కొత్తవి వినియోగిస్తున్నారా అంటూ తల్లిదండ్రులను అడుగుతున్నారు. జిల్లాకు పూర్తిస్థాయిలో కిట్లను పంపిణీ చేయకుండానే తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తుండడంతో హెచ్ఎంలు, ఎంఇఒలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆయన జిల్లాలో పర్యటించినప్పుడు ఇదే అంశంపై తల్లిదండ్రుల ఇళ్లకు వెళ్లి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు కొందరిపై చర్యలు తీసుకున్నారు. మరికొందరిని హెచ్చరించి వదిలేశారు.

ఇద్దరు ఎంఇఒలు సస్పెన్షన్

జగనన్న విద్యా కానుకలో పురోగతి బాగోలేదంటూ ఇద్దరు ఎంఇఒలపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చర్యలు తీసుకున్నారు. విద్యాశాఖపై బుధవారం నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో గార, కోటబొమ్మాళి ఎంఇఒలు ఎ.సోమేశ్వరరావు, సిహెచ్.గోవిందరావును సస్పెండ్ చేయాలని ఆదేశించారు. దీంతో డిఇఒ తిరుమల చైతన్య వారిని సస్పెండ్ చేశారు.

జీడికి మద్దతు ధర వరకూ పోరాటం

- 18న పలాసలో మహా ధర్నా
- ఉద్దానం గ్రామాల్లో జీపు జాతా
- రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

జీడి పంటకు మద్దతు ధర ప్రకటించే వరకు పోరాటం తప్పదని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జీడి రైతుల సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్ స్పష్టం చేశారు. మండలంలోని బాతుపురంలో బత్తిన లక్ష్మీనారాయణ అధ్యక్షతన జీడి రైతుల సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పాలకుల నిర్లక్ష్యానికి, జీడి వ్యాపారుల దోపిడీకి ఉద్దానం జీడి రైతులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి రైతుల్లో గందరగోళం సృష్టించి మద్దతు ధర ఉద్యమాన్ని నీరుగార్చే దురుద్దేశంతోనే జీడి పరిశ్రమల యాజమాన్యాలు మోసపూరిత లాకౌట్ ప్రకటించాయని విమర్శించారు. ధర ప్రకటించకుండానే గ్రామాల్లో కాటాలు వేసి, నగదు చెల్లించకుండా రెండు మూడు నెలల బదులుపై జీడిపిక్కలు తీసుకెళ్తూ దోపిడీని మరింత ఉధృతం చేస్తున్నారని చెప్పారు. మూడు నెలలుగా ప్రజాస్వామ్య పద్ధతిలో రైతులు అర్జీలు, నిరసనలు తెలియజేసినా ఇటు అధికారులు గానీ అటు ప్రజాప్రతినిధులు గానీ స్పందన లేదన్నారు. ఈ నేపథ్యంలో మరో ఉధృత పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈనెల 18న పలాసలో మహా ధర్నా చేపట్టడంతో పాటు ఉద్దానం గ్రామాల్లో జీపు జాతా నిర్వహిస్తామని ప్రకటించారు. సదస్సులో బాతుపురం సర్పంచ్ బత్తిని సృజన లక్ష్మీనారాయణ, బత్తిని రామారావు, బొడ్డు రమాదేవి, సాతుపల్లి కాంతారావు, తిర్రి రాజారావు, లక్ష్మీనారాయణ, ఎంపిటిసి కె.సురేఖ, మద్దిలి రామారావు తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమల మూసివేత చట్ట వ్యతిరేకం : సిఐటియు

జీడి పరిశ్రమల యజమానులు 25 రోజుల పాటు పరిశ్రమలను మూసివేస్తూ తీసుకున్న నిర్ణయం చట్ట వ్యతిరేకమని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎ.సత్యనారాయణ అన్నారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. మద్దతు ధర కోసం జీడి రైతులు పోరాడుతున్న సమయంలో పరిశ్రమల బంద్ ప్రకటించడం జిల్లాకు చెందిన మంత్రులు సీదిరి అప్పలరాజు, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం జోక్యం చేసుకొని జీడి పరిశ్రమలను తెరిపించి రైతులు, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



సదస్సులో మాట్లాడుతున్న మోహనరావు

శివారు రైతు ద్రోహులు కింజరాపు, గౌతు

రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - వజ్రపుకొత్తూరు

వంశధార శివారు రైతులకు సాగునీరు అందకుండా చేసిన ద్రోహులు మాజీ మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, గౌతు శ్యామసుందర శివాజీ అని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బెండిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు టెక్కలి ప్రాంతంలో అక్రమంగా 17 ఎత్తిపోతల పథకాలను వంశధార ప్రధాన కాలువపై ఏర్పాటు చేయడం వల్లే పలాస, వజ్రపుకొత్తూరులోని వంశధార శివారు భూములకు సాగునీరు అందడం లేదని ధ్వజమెత్తారు. అప్పటి పలాస ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ రైతుల సమస్యలను గాలికొదిలి మౌన దీక్షలతో కాలక్షేపం చేశారని దుయ్యబట్టారు. కింజరాపు కుటుంబం టెక్కలి, పలాస రైతుల మధ్య చిచ్చు పెట్టి వినోదం పొందుతోందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు శివారు రైతులకు అన్యాయం జరుగుతుంటే చోద్యం చూసిన గౌతు కుటుంబం, ఇప్పుడు రైతుల పక్షాన ఉన్నట్లు మొసలికన్నీరు కారుస్తోందని విమర్శించారు. ఆఫ్‌షోర్ పూర్తయితే శివారు రైతులకు సాగునీటి సమస్యలు తీరుతాయని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, ప్రత్యేకాధికారి మట్ట రవికృష్ణ, ఎంపిడిఒ సిహెచ్.ఈశ్వరమ్మ, జెడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పి.శ్రీనివాసరావు, ఎంపిపి ప్రతినిధి యు.ఉదయ్ కుమార్, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, వైస్ ఎంపిపిలు టి.శాంతారావు, వంక రాజు, జిల్లా ప్రణాళిక సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతు వెంకటరావుదొర తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఖుర్దా డివిజన్ రైల్వే అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎంపీ

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, పలాస

రైల్వే సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇచ్ఛాపురం, సోంపేట, బారువ, పలాస, మందస రోడ్డు రైల్వేస్టేషన్లను రైల్వే అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస రైల్వేస్టేషన్‌లో అన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల చేసే విధంగా రైల్వే అధికారులకు లేఖ రాసినట్లు తెలిపారు. రైల్వేస్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పలాస వరకు వస్తున్న డిఎంయు రైలును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని రైల్వే అధికారులను కోరినట్లు తెలిపారు. అమృత భారత్ పథకం కింద పలాస రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక లైను ఏర్పాటు చేసి ప్లాట్‌ఫాం నిర్మించనున్నట్లు తెలిపారు.

ఇచ్ఛాపురంలో అండర్ పాస్ నిర్మాణానికి రైల్వే అధికారులు సానుకూలంగా స్పందించారని చెప్పారు. సోంపేట రైల్వేస్టేషన్‌లో కోచ్ నంబర్లు సూచించే డిజిటల్ బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాలిబాట మార్గం మూసివేయడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, పునరుద్ధరించాలని నర్సిపురం గ్రామస్తులు ఎంపీని కోరారు. నెల రోజుల్లో పునరుద్ధరించేందుకు చర్యలు చేపడతామని ఆయన హామీనిచ్చారు. ఇళ్లను ఖాళీ చేయాల్సిందిగా రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చారని తమకు న్యాయం చేయాలని సోంపేట స్టేషన్ పరిసరాల్లో నివసిస్తున్న ఎస్ఆర్‌సి పురం, పురుషోత్తపురం, కంచిలి గ్రామాలకు చెందిన పలువురు ఎంపీని కోరారు. రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. బారువలో పలు సమస్యలపై ఎంపీకి స్థానికులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఈస్ట్‌కోస్ట్ రైల్వే ఖుర్దా డివిజన్ డిఇఎస్ అభిషేక్, డిసిఎం గిరీష్‌చంద్ నాయక్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష, వజ్జ బాబూరావు, పి.విఠల్‌రావు, మాదిన రామారావు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

22, 23న అంగన్వాడీ యూనియన్ జిల్లా మహాసభలు

- 10, 11న మహాధర్నాను జయప్రదం చేయాలి
- యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా మహాసభలను ఈనెల 22, 23 తేదీల్లో పలాసలో నిర్వహించనున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షులు డి.సుధ, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు తెలిపారు. మహాసభల్లో గత కార్యక్రమాలను సమీక్షించుకుని, భవిష్యత్ కర్తవ్యాలను రూపొందించనున్నట్లు చెప్పారు. అంగన్వాడీలు పెద్దసంఖ్యలో హాజరై మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభల పోస్టర్‌తో పాటు ఈనెల 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద చేపట్టే 36 గంటల మహా ధర్నా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి గ్రాట్యుటీ ఇవ్వాలని, వైఎస్ఆర్ పోషణకు మెనూ ఛార్జీలను పెంచాలన్నారు. అంగన్వాడీల కేంద్రాల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం 2023-24 బడ్జెట్‌లో 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందిగా ఉన్న స్కీమ్‌వర్కర్లను మోసం చేసిందన్నారు. బడ్జెట్‌లో ఐసిడిఎస్‌కు నిధులు పెంచలేదని, అంగన్వాడీ వేతనాల పెంపుతో పాటు అద్దె బకాయిలు చెల్లించడం లేదన్నారు. స్కీమ్‌వర్కర్లు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. పెరిగిన ధరలకనుగుణంగా వేతనాలు, మెనూ ఛార్జీలు పెంచడం లేదని, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచకుండా అప్పుల ఊబిలోకి నెడుతుందని చెప్పారు. వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ 10, 11న చేపడుతున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి కె.కళ్యాణి, నాయకులు పి.లతాదేవి, బి.ఆదిలక్ష్మి, వి.హేమవతి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు



బూర్జ : పొలాల్లో చేరిన నీరు

వర్షాతిరేకాలు

- జిల్లాలో పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు
- మదనాపురంలో గరిష్టంగా 89.5 మి.మీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో వేసవిని తలపించేలా ఎండ వేడిమి, వడగాల్పులు వీస్తున్న తరుణంలో బుధవారం పలు ప్రాంతాల్లో కురిసిన వర్షం ఊరటనిచ్చింది. బూర్జ మండలం మదనాపురంలో గరిష్టంగా 89.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కనిష్టంగా ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి, పాతపట్నం ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాతావరణం వ్యవసాయానికి కొంతమేర అనుకూలంగా మారింది. ప్రస్తుత ఖరీఫ్‌లో 3,98,750 ఎకరాల్లో వరి వేయాలని లక్ష్యంగా నిర్ణయించుకోగా, ఇప్పటివరకు సుమారు నాలుగు వేల ఎకరాల వరకు విత్తనాలు వేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు చెప్తున్నారు. మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు జోరందుకుంటాయని భావిస్తున్నారు.

జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తూరులో 43.25 మి.మీ, బూర్జలో 42.5 మి.మీ, కవిటి మండలం రాజపురంలో 31.25 మి.మీ వర్షం కురిసింది. శ్రీకాకుళంలో 29.5 మి.మీ, గార మండలం కళింగపట్నంలో 24 మి.మీ, తూలుగులో 17.5 మి.మీ, శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో 10.5 మి.మీ వర్షం పడింది. నరసన్నపేటలో 10.25 మి.మీ, ఎచ్చెర్లలో 9.75 మి.మీ, గారలో 8.75 మి.మీ, శ్రీకాకుళం నగరం బలగలో 8 మి.మీ, రణస్థలం, ఎల్.ఎన్‌పేటలో 5 మి.మీ వర్షం కురిసింది.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఈనెల 15, 16 తేదీల్లో శ్రీకాకుళం మండలం ఒప్పంగిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉషు క్రీడా పోటీల పోస్టర్‌ను కలెక్టరేట్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని తెలిపారు. ఆ దిశగా పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉషు క్రీడల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో జిల్లా కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని కోరారు. జిల్లాలో ఉషు రాష్ట్రస్థాయి టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య శిక్షకులు కళ్లేపల్లి శ్రీధర్, ఉషు జిల్లా కార్యదర్శి రెడ్డి శివకుమార్, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ముఖ్య సలహాదారు పి.సుందరరావు, జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు ఎస్.జోగినాయుడు తైక్వాండో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

రసాయన పరిశ్రమలతో అత్యంత ప్రమాదం

రణస్థలం : రసాయన పరిశ్రమలతో అత్యంత ప్రమాదమని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంటి మురళీధర్ అన్నారు. మండలంలోని రణస్థలం, పైడిభీమవరం పాఠశాలలను బుధవారం సందర్శించి మాట్లాడారు. విష వాయువులు వెదజల్లే పరిశ్రమలు పైడిభీమవరం వంటి జనావాసాల్లో నిర్మించడం ప్రమాదకరమన్నారు. ఎంతో ప్రమాదకరమైన అణువిద్యుత్కేంద్రాన్ని కొవ్వాడలో ఏర్పాటు చేయడం వల్ల అనేక పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. గాలి, నీరు కలుషితం కావడం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. పంట భూములు విష రసాయనాలతో నిండిపోయి వ్యవసాయానికీ నష్టపోయిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పరిశ్రమల్లో వ్యర్థాలను వేరు చేసే, విష వాయువులను ఫిల్టర్ చేసే యంత్రాలను వాడాలన్నారు. విరివిగా మొక్కలు నాటాలని పరిశ్రమల యజమానులను కోరారు. జెవివి జిల్లా ఉపాధ్యక్షులు పి.కూర్మారావు మాట్లాడుతూ విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, శాస్త్ర విజ్ఞాన ప్రచారం వంటి ముఖ్యమైన అంశాలపై జన విజ్ఞాన వేదిక కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు బి.రమణయ్య, సుధారాణి, ఉపాధ్యాయులు కె.భోజరాజు, కూన రంగనాయకులు, చెకుముకి కన్వీనర్ కె.వి రమణయ్య, కొత్తకోట నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా డిఎల్ఆర్ నమోదు

జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

డిఎల్ఆర్ నమోదును సమర్థవంతంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అధికారులను ఆదేశించారు. రీ సర్వే టీం వర్క్‌లో భాగంగా సర్వే డిటిలతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. రీ సర్వే నమోదులో వచ్చిన లోటుపాట్లను ఎప్పటికప్పుడు సరిచేసుకుని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. అవగాహన ఉంటే రీ సర్వే నమోదు ప్రక్రియ పురోగతి సాధించడం సులభమని చెప్పారు. కేటగిరీల వారీగా ఎలా నమోదు చేయాలి, వాటిలో లోటుపాట్లు పట్టిక ద్వారా ఎలా నమోదు చేయాలి తదితర అంశాలను వివరించారు. సందేహాలను నివృత్తి చేస్తూ పలు సూచనలు చేశారు. సమావేశంలో సర్వే డిటిలు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

అందరూ హెల్మెట్ ధరించాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎస్.శివరాం ప్రసాద్ అన్నారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం సింహద్వారం ద్వారం రహదారి భద్రతా అవగాహన కార్యక్రమాలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారి భద్రతా నియమాలను అందరూ పాటించాలన్నారు. హెల్మెట్ ధరిస్తే ప్రమాద సమయంలో తలకు దెబ్బ తగలకుండా కాపాడుతుందని చెప్పారు. రహదారి భద్రతపై అందరూ అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు డి.సంజీవరావు, వై.శ్రీనివాసరావు, ఆర్.గోవిందరాజు, పి.వి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన

ఆమదాలవలస : విద్య బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని తొగరాం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు కార్యక్రమం ద్వారా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, అందుకే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా రాణిస్తున్నారని తెలిపారు. తొగరాం కేంద్రంగా జూనియర్, డిగ్రీ కళాశాలలను ప్రారంభించామని, త్వరలోనే పిజి కేంద్రాన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటికే అగ్రికల్చరల్, పాలిటెక్నిక్ కళాశాలలను ఏర్పాటు చేశామని తద్వారా తొగరాం విద్యా హబ్‌గా మారిందని తెలిపారు. తాను ముఖ్యమంత్రిని ఒప్పించి ఈ ప్రాంతంలో విద్యాసంస్థలను నెలకొల్పుతున్నానని, మీ పిల్లలను ఇక్కడ చదివించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఎంఇఒ జి.రాజేంద్రప్రసాద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.పోలినాయుడు, విద్యా కమిటీ చైర్మన్ కె.రాఘవాచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, DAVARASINGU LAXMI is legally wedded spouse of Army. No. 2605527H, Rank: HAV, Name: **DAVARASINGU DIVAKAR** in Army, Resident of Pedda Veedhi, Marlapadu Village, Uddanam Kurmanadhapuram Post, Nandigama Mandal, Srikakulam District, AP-532218. I have changed my name from **KUPPILLI LAXMI to DAVARASINGU LAXMI** in my all documents. Affidavit dated 04.07.2023, before advocate and notary public, Kasibugga (AP).

IN THE HON'BLE COURT OF THE JUNIOR CIVIL JUDGE: ICHAPURAM. O.S. 09/2018.

Between:
Telli Venkataswamy --Plainitiff.
And:
Telli Venkata Rao and others --Defendants.

To,
1. Telli Sasi, W/o Late Krishna Rao, Chinna Medara Street, Ichapuram, Srikakulam District. (Defendant No. 11).
2.Telli Chinna Rao, S/o Late Krishna Rao, Chinna Medara Street, Ichapuram, Srikakulam District. (Defendant No. 12).

NOTICE

Please take notice that the above named plaintiff has filed the suit against you and others for partition and the matter is posted to **14-07-2023** for appearance of you Defendant No. 11 and 12 before the Hon'ble Court of Junior Civil Judge, Ichapuram **at 10:30 A.M.,** in person or through your Counsel, or else the matter will be decided in your absence.

Sri Monoj Kumar Samonto,
Advocate,
Ichapuram,
Srikakulam District.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT TEKKALI S.O.P.3/2022

Between:
1. Talagana Prasanthi, W/o late Krishna, aged about 43 years, Hindu, Household duties, resident of Door No.1-122, Kovela Veedhi, Yethurallapadu Village, Peddabammidi Post, Kotabommali Mandal, Srikakulam district, Aadhar Card No.8851 3011 9712.
2. Talagana Bhargava Naidu, S/o late Krishna, aged about 25 years, Hindu, resident of Door No.1-122, Kovela Veedhi, Yethurallapadu Village, Peddabammidi Post, Kotabommali Mandal, Srikakulam district, Aadhar Card No.8550 9082 1906. --Petitioners.
And:
Nil --Respondent.

పై నెంబరు గల పిటిషన్ లో పిటిషనర్స్ సక్షషన్ సర్టిఫికెట్ కొరకు పై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినందున సదరు పిటీషన్‌లో ఎవరికైన ఎట్టి అభ్యంతరములున్నచో **తే॥21-07-2023 ఉ॥ 10: 30 ని॥ లకు** పైన తెలిపిన కోర్టు యందు మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై తెలియజేయవలెను . లేనియడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

కె. సింహాచలం
అడ్వకేట్, శ్రీకాకుళం,
సెల్ : 9059808685, 9440257845.

నోటీసు
(0 21 R 54 CPC)
HON'BLE JUNIOR CIVIL JUDGE COURT AT ICHAPURAM
EP 04/2021 IN OS 17/2019

Gujju Lokanadha Reddy -- Petitioner/ D.H.R
Bikram Kesari Das -- Respondent/ J.D.R
To
బిక్రమ కేసరిదాస్, S/o judhistir das, R/o రామయ్య వీధి, పాత కొజ్జీరియ గ్రామం, కొజ్జీరియ పంచాయితీ, కవిటి మండలం, శ్రీకాకుళంజిల్లా.

పైకేసులో మీరు పిటిషనర్ చెల్లించవలసిన డిక్రీ మొత్తంను చెల్లించనందున ఈదిగువ మీతాలూకా షెడ్యూలు ఆస్తిని జప్తు చేయడమయినది. సదరు ఆజప్తు చేయబడిన ఆస్తిపై మీకు ఆక్షేపణలు వున్న **తేది 28-07-2023న ఉ॥ 10 గంటలకు** ఖుద్దునకు గాని, వకీలు ద్వారా గాని ఈ కోర్టులో హాజరై కోర్టు వారితో మనవిచేసుకోవలసింది. లేనియెడల సదరు విషయంపై మీపరోక్షంన విచారించి తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

ఆస్తివివరములు:
శ్రీకాకుళం జిల్లా, కవిటి మండలం, ఇచ్ఛాపురం సబ్ రిజిస్ట్రేషన్ పాతకొజ్జీరియ గ్రామంలో, రామయ్య వీధిలో గల డాబా ఇల్లు డో॥1-317, విస్తీర్ణం ఉత్తరం నుండి దక్షిణంకు 21.33 మీటర్లు పొడవు, తూర్పు నుండి పశ్చిమానికి 3.04 మీటర్లు వెడల్పుగలది. **హద్దులు:** తూర్పు మీతాలూకా ఇల్లు డో॥3-1-318, పడమర: జీరు ఉమాపతి ఇల్లు డో॥ 3-1-316,ఉత్తరం: రోడ్డు దక్షణం: ఖాళీస్థలం.

S.L. NARAYANA
ADVOCATE,
cell : 9440275569.


సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని బాణాంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఆ కుటుంబంలో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఏ మేరకు అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా అర్హత ఉండి పథకాలు అందకపోతే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాంతారావు, సర్పంచ్ ప్రతినిధి పి.వి.రవిబాబు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్ పాల్గొన్నారు.

యువత ఓటుతోనే ఉజ్వల భవిత

- కొనసాగుతున్న నూతన ఓటర్ల ప్రక్రియ
- 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులే

ప్రజాశక్తి- జి.సిగడాం

ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైంది. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్దేశిస్తుంది. ఉత్తమ విలువలున్న అభ్యర్థిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవడానికి దోహదపడుతుంది. ఇవన్నీ జరగాలంటే అర్హులంతా విధిగా ఓటర్లుగా నమోదు కావాలి. నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి. వారు ఓటింగ్‌లో పాల్గొనాలి. అయితే యువతలో చాలా మంది ఓటరుగా నమోదు కావడానికే అంతగా ఆసక్తి చూపడం లేదు. తర్వాత చూడొచ్చులే అన్న ధోరణిలో రోజులు గడిపేస్తున్నారు. సాధారణ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం యువకులు ఓటర్లుగా నమోదు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. వీటిని విజయవంతంగా చేయాలని కలెక్టర్, రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. దానితోపాటే మార్పులు, చేర్పులు, తొలగింపులు అన్నింటినీ చేసుకొనే అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమాలను యువత సద్వినియోగం చేసుకోవాలని రెవెన్యూ వర్గాలు కోరుతున్నాయి. 2004 నుంచి జరుగుతున్న ఎన్నికలను పరిశీలిస్తే ఎచ్చెర్ల నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో ఓటర్ల సంఖ్య పెరుగుతుండగా జి.సిగడాం మండలంలో కొంత తగ్గుతోంది. నియోజకవర్గాల్లోనూ యువ ఓటర్ల చేరిక మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. తాజా గణాంకాల ప్రకారం ఎచ్చెర్ల నియోజకవర్గంలో 18 నుంచి 20 ఏళ్ల మధ్య గల వారు నియోజకవర్గంలో 2,217 మంది ఓటరుగా నమోదు చేశారు. అందులో జి.సిగడాం 341, లావేరు 526, రణస్థలం 697, ఎచ్చెర్ల 653 ఓటర్లుగా నమోదయ్యారు. ప్రస్తుతం ఈ నియోజకవర్గాల్లో యువ ఓటర్లు ఇంకా చాలా మంది ఉన్నారని, వారితో కూడా ఓటు హక్కు నమోదు చేయించాలనే లక్ష్యంతో కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఇదీ తాజా షెడ్యూల్

రాష్ట్ర ఎన్నికల సంఘం 2024 సాధారణ ఓటర్ల జాబితా తయారీకి ఆదేశాలు ఇచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 1 నుంచి నుంచి ఈ ప్రక్రియ మొదలు పెట్టారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారంతా ఓటు హక్కు నమోదుకు అర్హులే. 2005లో జన్మించిన వారందరూ ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు. జులై 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకూ బిఎల్‌ఒలు ఇంటింటా తిరిగి ఓటర్ల జాబితాలో చేర్పులతో పాటు, తప్పులు ఏవైనా ఉంటే ఫోన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తాన్ని సెప్టెంబరు 29వ తేదీ లోపు పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

దరఖాస్తు ఇలా...

18 ఏళ్లు నిండుతున్న వారంతా ఓటరుగా చేరడానికి ఫారం-6ను పూర్తి చేసి అధికారులకు అందివ్వాలి. దీనితోపాటు పుట్టిన తేదీ ధ్రువీకరణ పత్రం, రెండు కలర్ పాస్‌పోర్టు ఫొటోలూ ఇవ్వాలి. చిరునామా మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర విషయాలకు సంబంధించి ఫారం-7, 8, 8ఎ లుంటాయి. అధికారులను అడిగి తీసుకుని వీటిని పూర్తి చేసి ఇస్తే జాబితాలో మార్పులు చేస్తారు.

ఆన్‌లైన్‌లో కూడా...

ఓటర్ల జాబితాలో ఎన్నికల సంఘం ఆన్‌లైన్ సదుపాయాన్నీ కల్పించింది. భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో సంబంధిత దరఖాస్తు పూర్తి చేసి వివరాలు అప్‌లోడ్ చేసి పంపిస్తే పరిశీలన అనంతరం ఓటును మంజూరు చేస్తూ జాబితాలో చోటు కల్పిస్తారు.

నమోదు ప్రక్రియ ప్రారంభం

బిఎల్‌ఒలతో ఓటర్ల జాబితా నమోదు ప్రక్రియ ప్రారంభించాం. గ్రామాల్లో బూత్ లెవెల్‌లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలి.

- పి.వేణుగోపాలరావు, తహశీల్దార్

మాట్లాడుతున్న నారాయణరావు

యువ క్లబ్‌లతో పర్యాటక అభివృద్ధి

జిల్లా పర్యాటక అధికారి నారాయణరావు

ప్రజాశక్తి- నరసన్నపేట

యువ టూరిజం క్లబ్ ద్వారా పర్యాటక అభివృద్ధి సాధించవచ్చునని జిల్లా పర్యాటకశాఖ అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాలలో కేంద్ర పర్యాటక మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన యువ టూరిజం క్లబ్ ఎంపిక చేసిన విద్యార్థులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువ టూరిజం క్లబ్ ద్వారా పర్యాటక అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ క్లబ్‌లో ఉన్న సభ్యులకు జిల్లాలోని పర్యాటక ప్రదేశాలపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన శిక్షణను అందిస్తామని తెలిపారు. వీరు పర్యాటక ప్రదేశాల గురించి మరింత ప్రచారం చేయడమే అజెండాగా పనిచేస్తారన్నారు. ఇప్పటికే దేశంలో పలుచోట్ల ఈ యువ టూరిజం క్లబ్ తమ కార్యకలాపాలను విజయవంతంగా విస్తరిస్తోందని చెప్పారు. జిల్లాలో అభివృద్ధికి నోచుకోక మరుగునపడిపోతున్న ఎన్నో ప్రదేశాలను ఈ టూరిజం క్లబ్ ద్వారా మనుగడలోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గాప్రసాద్, సెట్రిస్ మేనేజర్ వి.వి.అప్పలనాయుడు, డిటి ఎల్.ఎల్.నాయుడు, సహాయ అధికారి కె.వి.రమణ, కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి ఎ.మేరీరత్నం, ఎన్‌వైకె ప్రతినిధి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత యాంటీ రేబిస్ టీకా శిబిరం

జలుమూరు: పెంపుడు కుక్కలకు ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మండలంలోని జలుమూరు, అచ్చుతాపురం, అల్లాడల్లో గురువారం ఉచిత యాంటీ రేబిస్ టీకా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయా పశు వైద్యాధికారులు ఎం.దీప్తి, పి.సంతోష్‌కుమార్, కె.నారాయణమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 6న ప్రపంచ జూనోసెస్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. కుక్కల నుంచి మనుషులకు వ్యాధి సంక్రమించకుండా నిరోధించడానికి మూడు నెలల కంటే ఎక్కువ వయసు ఉన్న ప్రతి పెంపుడు కుక్కకూ తప్పనిసరిగా రేబీస్ టీకాలు వేయించాలని సూచించారు.

ఉపాధి కోల్పోతున్న జీడి కార్మికులు

ప్రజాశక్తిగీ పలాస

జీడి వ్యాపారుల లాభాల కోసం జీడి పరిశ్రమలను తాత్కాలికంగా బంద్ చేపట్టడంతో జీడి పరిశ్రమంలో పనిచేస్తున్న 25 వేల మంది కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మండల కన్వీనర్ ఎం.లావణ్య, కో కన్వీనర్ టి.సింహాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. కాశీబుగ్గ సిఐటియు కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. 25 రోజుల పాటు జీడి పరిశ్రమల బంద్ చేయడం ద్వారా కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. బంద్ చట్ట వ్యతిరేకమని అన్నారు. జీడి యాజమాన్యాలు జూలై 5 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు పరిశ్రమలు బంద్ ప్రకటించి అటు రైతాంగాన్ని, ఇటు కార్మికులను తీవ్రంగా దోచుకోవడానికి ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. యాజమాన్యాలు బంద్ ప్రకటించిన రోజులకు కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, చట్టపరమైన సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఒకవైపు జీడి రైతాంగం మద్దతు ధర పెంచాలని పోరాటం చేస్తుంటే.. బంద్ ప్రకటించడం రైతులను బ్లాక్ మెయిల్ చేసే విధంగా ఉందని అన్నారు. బంద్ ప్రకటించడం తప్పుడు పద్ధతి అని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రి సీదిరి. అప్పలరాజు వెంటనే జోక్యం చేసుకొని జీడి పరిశ్రమల బంద్ నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జీడి పరిశ్రమలు బంద్ చేసేందుకు చట్టపరమైన అనుమతులు ఎవరు ఇచ్చారో బహిర్గత పర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు జి.జ్యోతి, వి.రజని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న గణపతి

ఇల్లు కట్టకపోతే పట్టా రద్దు

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

లబ్ధిదారునితో మాట్లాడుతున్న రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు ఎందుకు జాప్యం చేస్తున్నారని టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ ఇంజాంపాడు, శ్రీజగన్నాథపురం పంచాయతీల్లో ఉన్న పలు గ్రామాల్లో బుధవారం పర్యటించారు. లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇళ్లు ఎందుకు నిర్మించడం లేదని ఆరా తీశారు. హుదూద్ తుపానులో తనకున్న పూరిగుడిసె కూలిపోవడంతో నిలువనీడలేక వింజాంపాడులో నివాసముంటున్న ఉప్పాడ వెంకన్నకు జగనన్న కాలనీలో ఇల్లు మంజూరైంది. ప్రభుత్వం ఇచ్చిన ఇల్లు ఎందుకు నిర్మించుకోలేదని లబ్ధిదారుడిని అడిగి తెలుసుకున్నారు. అయితే లబ్ధిదారుడు వెంకన్నతో పాటు అక్కడ గ్రామస్తులు వెంకన్న ఆర్థిక స్థితిగతులు, ప్రస్తుతం పెరిగిన ధరలు తదితర అంశాలను సబ్ కలెక్టర్‌కు వివరించి జాప్యంకు గల కారణాలు తెలిపారు. మంజూరులైన గృహ నిర్మాణాల నిధులు మురిగిపోకుండా త్వరితగతిన ఇళ్లు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనలు సడలించలేమని తెలిపారు. ఎవరైనా ఇళ్లు నిర్మించకుంటే పట్టాలను ప్రభుత్వం రద్దు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జామి ఈశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

శ్రీకాకుళం అర్బన్ : గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ రంగంలోని సమస్యల పరిష్కారానికి రైతులు, వ్యవసాయ కూలీలు, కౌలుదారులతో కలిసి ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలకు రాష్ట్రస్థాయి ప్రాంతీయ శిక్షణ శిబిరం బుధవారం నిర్వహించారు. ముందుగా వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక ఉద్యమాల్లో నూతనంగా వస్తున్న కార్యకర్తలు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. మారుతున్న గ్రామీణ వ్యవసాయ పరిస్థితుల గురించి కార్యకర్తలు అవగాహన చేసుకోవడానికి ఈ శిక్షణా శిబిరాలు దోహదపడతాయన్నారు. ఈ శిబిరానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. వర్తమాన రాజకీయ పరిస్థితులు అనే పాఠాన్ని సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు బోధించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సిర్ల ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఈశ్వరమ్మ, కె.ఎల్లయ్య. డి.భాస్కరరావు, శ్రీను, గంగునాయుడు, అప్పారావు పాల్గొన్నారు.

దస్తావేజుల కొరత

కోటబొమ్మాళి: స్థానిక సబ్‌రిజిస్టర్ కార్యాలయంతో పాటు జిల్లాలోనే రూ. 100, రూ.50లు విలువ కలిగిన దాస్తావేజు స్టాంప్ పేపర్లు కొంత కాలంగా కొరత ఏర్పడింది. దీంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.100, రూ.50 విలువ చేసే స్టాంప్ పేపర్లు ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో చిన్నచిన్న ఇచ్చుపుచ్చుకోడాలకు, స్వల్ప క్రయవిక్రయాలకు, పూచికత్తులకు వినియోగిస్తుంటారు. ఇదిలా ఉండగా ఇటీవల ప్రభుత్వం కాంట్రాక్టరు ఉద్యోగులు రెన్యూవల్ కూడా రూ.100ల స్టాంప్ పేపర్ తప్పని ప్రభుత్వం చేసింది. ఈ బాండ్ పేపర్లు కొరత ఏర్పాడడంతో కాంట్రాక్ట ఉద్యోగులూ కాల పరిమితిలోగా రెన్యూవల్ చేసుకోలేని పరిస్థితి తలెత్తడంతో లబోదిబోమంటున్నారు. కొద్ది రోజుల పాటు పోస్టాఫీసుల్లో లభించినప్పటికీ సంబంధిత వ్యక్తులు తమ ఆధార్ కార్డులతో పాటు పలు నిబంధనలు పెట్టడంతో ఉద్యోగులు సెలవులు దొరకక, రావడం అలస్యం కావడంతో ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా స్పందించి ఈ స్టాంపులను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

సంతకాలను సేకరిస్తున్న సభ్యులు

కొనసాగిన సంతకాల సేకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యుత్ ఛార్జీల పెంపుదలపై శ్రీకాకుళం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం కూడా కొనసా గింది. రెండో రోజున నగరంలోని డేఅండ్‌నైట్ కూడలి వద్ద ప్రజా బ్యాలెట్, సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎం.ఆదినారాయణమూర్తి, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు వి.జి.కె.మూర్తి అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

'సొండి'లను ఒబిసిలో చేర్చాలి

సోంపేట: సొండిలను ఒబిసి జాబితాలో చేర్చే విధంగా కేంద్రం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సొండి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నాల కాశీవిశ్వనాథ చౌదరి, బి.రాజారావు కోరారు. ఈ మేరకు తాడేపల్లిగూడెంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ సొండిల స్థితిగతులు, వారు పడుతున్న ఇబ్బందులు, జీవన విధానం గురించి తెలియచేశారు. గతంలో సొండిను ఓబిసి జాబితాలో చేర్పించేందుకు వివిధ కమిషన్లు నివేదికలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేశాయని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు పి.శ్రీనివాసరావు, మొగలిపురి అప్పలరాజు, నల్ల మురళి, రత్నాల బాలకృష్ణ చౌదరి, మొగలిపురి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

తోటవీధిలో విద్యుత్ కోతలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా ప్రధాన కేంద్రమైన శ్రీకాకుళం నగరంలో విద్యుత్ కోతలు సర్వసాధారణ మయ్యాయి. నగర పరిధిలోని గుజరాతిపేట సమీపంలో గల తోటవీధికి ఇప్పటికీ టౌన్ ఫీడర్ నుంచి విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఈ ప్రాంత వాసులకు తిప్పలు తప్పడం లేదు. చిలకపాలెం సబ్‌స్టేషన్‌లో ఎటువంటి సాంకేతిక సమస్య తలెత్తినా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండడం లేదు. నిరంతర విద్యుత్తు అందిస్తున్నామని ప్రభుత్వం చెపుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో జరుగుతున్న సరఫరాకు పొంతన కుదరడం లేదు. దీంతో ప్రజలు రేయింబవళ్లు విద్యుత్ కోతలతో అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోతే ఆ రాత్రంతా దోమల మోత తప్పడం లేదు. తక్షణమే ఈ ప్రాంతంలో ప్రత్యేక ఫీడరును ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

నందిగాం: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం పంచాయతీ పెంటూరులో పంచాయతీ నిధులతో చెరువు మెట్లు నిర్మాణ పనులను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిస్థాయిలో చేపట్టడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, సర్పంచ్ ప్రతినిధి జడ్యాడ జయరాం, ఎంపిటిసి ప్రతినిధి అంబోడి విష్ణు, అట్టాడ ప్రభాకరారావు నాయుడు, జనార్థనరావు పాల్గొన్నారు.

పోర్టు నిర్మాణంతో జిల్లా అభివృద్ధి

ప్రజాశక్తి- నౌపడ

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న మూలపేట పోర్టు ప్రాంతాన్ని కేంద్ర భవన నిర్మాణ కార్మికుల సలహా బోర్డు చైర్మన్ ఎన్.శ్రీనివాస్ నాయుడు బుధవారం సందర్శించారు. అనంతరం సంబంధిత అధికారులతో సమీక్షించారు. పోర్టు నిర్మాణంతో జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగుతాయన్నారు. ఈయనతో పాటు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, టెక్కలి నియోజవర్గ ఇన్‌ఛార్జి అట్టాడ రవిబాబ్జి, జిల్లా అధ్యక్షులు బర్లంగి ఉమామహేశ్వరరావు, యువ మోర్చా జిల్లా అధ్యక్షులు బూరే నరేంద్ర చక్రవర్తి, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ ఉన్నారు.

పరిశీలిస్తున్న శ్రీనివాస్ నాయుడు

చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో భూగర్భ జలాలు క్రమబద్ధం చేయడానికి చెట్టు, భూమి, నీరు చట్టం ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ చట్టంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని, అందువల్ల ఈ చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని అరసవల్లిలో ఉన్న తన స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చట్టాలను అనుసరించి అక్రమ పద్ధతుల్లో మైనింగ్ కార్యకలాపాలపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అప్పుడే చట్టసభల్లో ఆమోదించిన చట్టాలకు విలువ ఉంటుందన్నారు. సురక్ష సమావేశాల్లో మంత్రి ధర్మాన ప్రసాదరావు రానున్న ఎన్నికల్లో మీకు నచ్చిన వారికే ఓటు వేయాలని చెప్పడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. అయితే అంతటి సచ్ఛీలత కలిగి ఉంటే వైసిపి ప్రభుత్వం ప్రతిపక్షాలు, పత్రికలు, ప్రజలపై పెడుతున్న ఆంక్షలు ఎందుకని ప్రశ్నించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మందస : ఉన్నతమైన సమాజ నిర్మాతలు ఉపాధ్యాయులని, ప్రధానోపాధ్యాయులు ఎన్.తారకేశ్వరరావు గ్రామానికి, పాఠశాలకు అనుసంధాన కర్తగా వ్యవహరిస్తూ... పాఠశాల మౌలిక వసతులను సమకూర్చి విద్యాభివృద్ధికి దోహదపడ్డారని సర్పంచ్ జె.పురుషోత్తం, మార్పు ట్రస్టు చైర్మన్ మట్ట ఖగేశ్వరరావులు కొనియాడారు. మందస మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి హరిపురం పాఠశాలకు ఆర్.వి సోమేశ్వరరావు, ఆర్.జయలక్ష్మి, టి.తారకేశ్వరరావు, జి.లోహితాస్యుడు, కె.రుద్రయ్యలు ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ మేరకు ప్రధానోపాధ్యాయులు జి.ఉమారాజు అధ్యక్షతన బదిలీపై ఉపాధ్యాయులకు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎ.అప్పన్న, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ వి.కళాగోవిందరావు, మాజీ ఎంపిటిసి సభ్యులు రాము, గ్రామ పెద్దలు ఎం.శ్రీరాములు, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ జి.మురళి, దమయంతి, సింహాచలం, సాంబమూర్తి పాల్గొన్నారు.


సన్మానిస్తున్న సర్పంచ్ పురుషోత్తం

డిగ్రీ సెమిస్టర్‌లో 'స్వర్ణభారతి' విద్యార్థుల హవా

స్వీట్ తినిపిస్తున్న తులసీదాస్‌రెడ్డి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

డిగ్రీ మొదట సంవత్సర సెమిస్టర్ ఫలితాల్లో స్వర్ణభారతి డిగ్రీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి రికార్డు సృష్టించారని చైర్మన్ చాటల తులసీదాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో వలపు హర్షిత 9.5 పాయింట్లు సాధించి డివిజన్‌స్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకుందన్నారు. హర్షిత అక్క వలపు దుర్గాభవాని కూడా గత ద్వితీయ సెమిస్టర్‌లో నియోజకవర్గ స్థాయిలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని తెలిపారు. ఒక నిరుపేద కుటుంబంలో జన్మించిన వీరిద్దరూ కష్టపడి చదువుతున్నారని అన్నారు. వీరి తండ్రిని కరోనా రూపంలో కాటేసి శోకాన్ని మిగిలించిందన్నారు. అందుకు పట్టుదలతో చదువుకొని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తూ... అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో చాటల రాము, ప్రిన్సిపాల్ కె.సందీప్, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ జె.జయప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : విద్యార్థులను పరీక్షిస్తున్న డాక్టర్ గాయత్రి

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

డెంగీ వ్యాధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కె.కొత్తూరు పిహెచ్‌సి డాక్టర్ శిష్టు గాయత్రి అన్నారు. స్థానిక గిరిజన బాలికల వసతిగృహాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వైరస్ వెస్ట్ నైల్ ఇన్ఫెక్షన్ జ్వరానికి సంబంధించిందని, డెంగీ వైరస్ ఎడిస్ దోమకుట్టడం ద్వారా ఈ జ్వరం వ్యాపిస్తుందని వివరించారు. డెంగీ ఫీవర్ వ్యాపించిన ఆరు రోజుల తర్వాత దాని లక్షణాలు కనిపిస్తాయన్నారు. తీవ్రమైన తలనొప్పి, కీళ్లనొప్పి, కండరాల నొప్పి, వికారం, అలసిపోవడం, జ్వరం, వాంతులు ఐదు రోజుల తర్వాత చర్మంపై దద్దుర్లు కలుగుతాయని పేర్కొన్నారు. డెంగీ వ్యాధి రాకుండా ఉండాలంటే పరిసరాలు, ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తాగునీరు ట్యాంకు, డ్రమ్ముల్లో నీటిని తప్పనిసరిగా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఏడిస్ దోమలు పగటిపూట కూడతాయని, కాబట్టి పిల్లలు, వృద్ధులు, విశ్రాంతి తీసుకొనే మహిళలు దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. పై లక్షణాలు ఉన్న వారు వెంటనే వైద్యులు సలహాలు తీసుకోవాలన్నారు. 26 మందికి కళ్ల కలకులు గుర్తించినట్లు తెలిపారు. వసతిగృహ పరిసరాలను పరిశీలించి వాటర్ ట్యాంకు, మురునీరు నీరు వెళ్లే విధంగా ఏర్పాటు చేయాలని సూచించారు. ఈమెతో పాటు ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

కవిటి: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చని రాజపురం ప్రభుత్వాస్పత్రి వైద్యుడు శశిధర్ అన్నారు. ఎల్సిడిసి సర్వేలో భాగంగా తమ పరిధిలోని తొత్తిడిపుట్టుగ, ముత్యాలపేట తదితర గ్రామాల్లో అనుమానిత కేసులను పరీక్షిస్తున్నారు. అనంతరం స్థానికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పరిసరాలు పరిశుభ్రత ఆవశ్యకత వివరిస్తున్నారు. కార్యక్రమంలో ఇఒ అభిమన్యు సోయి, హెచ్.వి భారతి, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

కవిటి : అనుమానిత వ్యక్తిని పరీక్షిస్తున్న డాక్టర్ శశిధర్

డిఫెన్స్ కౌన్సిల్‌కు ముగ్గురు ఎంపిక

శ్రీకాకుళం లీగల్ : శ్రీకాకుళం జిల్లా కోర్టు ఆవరణంలో ఉన్న కోర్టులకు డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులుగా ముగ్గురు న్యాయవాదులు బుధవారం ఎంపికయ్యారు. జిల్లా కోర్టులకు సీనియర్ న్యాయవాదులైన ఆఫీస్‌నాయుడు, పుట్ట అంజనేయకుమార్, కింద కోర్టుకు హర్షవర్ధన్ ఎంపికయ్యారు. వీరి ఎంపికపై సీనియర్, జూనియర్ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

ఎంపికైన న్యాయవాదులు

ఉద్యోగుల రక్తదానం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 30 మంది ఆశాఖ ఉద్యోగులు బుధవారం స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని చైర్మన్ పి.జగన్మోహనరావు, ప్రాజెక్టు డైరెక్టర్ నక్క గణపతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జగన్మోహనరావు మాట్లాడుతూ గృహ నిర్మాణశాఖ ఏటా ఇంజినీరింగ్స్ డే, గృహ నిర్మాణశాఖ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ప్రమాద సమయంలో ఎదుటివారి ప్రాణాలు కాపాడాలన్న సంకల్పంతో ఈ శిబిరాలు నిర్వహించడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం రక్తదాతలకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత చీఫ్ ఇంజినీర్ పల్లి శ్రీరాములు, ఇఇ పి.జె.మోహనరావు, డిఇఇ కె.అప్పారావు, కె.వి.డి.నాగేశ్వరరావు, వి.నర్సింగరావు, ఎఇ బి.గణేశ్వరరావు, ఎ.శంకరరావు, ఐతం శ్రీనివాసరావు, ఎం.కుమార్‌శేఖర్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

ఏం కష్టమొచ్చిందో!

కనిమెట్టలో డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి- పొందూరు

వారిది నిరుపేద కుటుంబం. ఇద్దరూ ఆడపిల్లలైనా కాయకష్టం చేసుకుంటూ వారిని ఉన్నతంగా చదివిస్తున్నారు ఆ తల్లిదండ్రులు. ఉన్నతంగా చదువుకుని ఉద్యోగాలు సాధించి ప్రయోజకులు అవుతారని ఎన్నో కలలు కన్నారు. ఇంతలో ఏం కష్టం వచ్చిందో కానీ పెద్ద కుమార్తె ఉరేసుకొని తనువు చాలించడంతో ఆమె తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. మండలంలోని కనిమెట్టకు చెందిన డిగ్రీ విద్యార్థి చౌదరి మోహిని కుమారి (21) బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చౌదరి రాజగోపాలరావు, రమణమ్మ దంపతుల పెద్ద కుమార్తె మోహిని కుమారి శ్రీకాకుళం కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతుంది. రెండో కుమార్తె విజయనగరంలో డిప్లమో చదువుతుంది. తండ్రి పొలం పనులకు వెళ్లగా, తల్లి ఆశ కార్యకర్త కావడంతో గ్రామంలో విధులకు వెళ్లింది. ఆ సమయంలో చున్నీతో ఆత్మహత్యకు పాల్పడింది. ఇంటికి వచ్చిన తల్లి తలుపులు ఎంత కొట్టినా తీయకపోవడంతో గ్రామస్తుల సహకారంతో తలుపులను బద్దలు కొట్టి తెరిచి చూసేసరికి విగతజీవిగా ఉన్న కుమార్తెను చూసి బోరున రోదించింది. వివాహం చేస్తామని తల్లిదండ్రులు మోహినికి చెప్పారు. ఉన్నత చదువులు చదవాలని కోరుకున్న యువతి... తల్లిదండ్రులు మాట కాదనలేక... ఉన్నత చదువులు చదవాలనే తన కోరిక చంపుకోలేక ఒత్తిడికిలోనై ఈ ఘటనకు పాల్పడి ఉంటుందని భావిస్తున్నారు. సోదరి గాయత్రి విజయనగరం నుంచి గ్రామానికి చేరుకుని అక్క మృతదేహంపై పడి రోదించడం చూపరులను కలిచివేసింది. గ్రామంలో మంచిపేరు తెచ్చుకున్న మోహిని కుమారి ఆత్మహత్యకు పాల్పడడంతో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బందితో చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్)లో మోహిని కుమారి (ఫైల్)

'జగనన్న సురక్ష' ప్రజలకు రక్ష

శ్రీకాకుళం అర్బన్ : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ధర్మాన

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జగనన్న సరక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ప్రజలకు మరింత జవాబుదారీగా ఉందని తెలియజెప్పేందుకే నిర్వహిస్తున్నామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. నగరంలోని బాపూజీ కళా మందిరంలో పెద్దరెల్లివీధి ప్రజలతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు, గృహసారథులు, గ్రామ సచివాలయ కో-ఆర్డినేటర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు నిర్వహించడంతో పాటు సంబంధిత వార్డుల్లోనే అధికార యంత్రాంగం ఉండి ప్రజలకు సేవలు అందించనున్నట్టు తెలిపారు. ధ్రువపత్రాల పేరిట 11 రకాల సర్వీసులు ఈ కార్యక్రమం ద్వారా అందిస్తున్నామని చెప్పారు. నగరంలో రూ.500 కోట్లు వెచ్చించి 12 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చామని అన్నారు. పొట్టిశ్రీరాములు మార్కెట్‌ను అభివృద్ధి చేశామని అన్నారు. నగర ప్రజలకు ఆరు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి వైద్యం అందుబాటులోకి తెచ్చామన్నారు. రోడ్లు, డ్రెయినేజీ సిస్టమ్‌ను మెరుగు పరుస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు, కళింగ కోమటి కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, తహశీల్దార్ వెంకటరావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఎం.వి.పద్మావతి, కోణార్క్ శ్రీను, మెంటాడ స్వరూప్ పాల్గొన్నారు.

జి.సిగడాం: జగనన్న సురక్ష ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని టంకాలదిగ్గువలస, పాలఖడ్యాం పంచాయతీల్లో సర్పంచ్‌లు టంకాల జగన్మోహిని, దారబోయిన వెంకటప్పడు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణ, మండల ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, వైసిపి మండల అధ్యక్షుడు బురాడ వెంకటరమణ, ఎంపిడిఒ కె.నిశ్చల, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, డిటి ఎన్.నిర్మల, ఎంఇఒ అరసాడ రవి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కొత్తూరు : ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష అని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. స్థానిక సచివాలయం-1 వద్ద సర్పంచ్ పడల కృష్ణవేణి అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించి వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మఒడి కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి భాగ్యవతి, వైసిపి మండల కన్వీనర్ సారిపల్లి ప్రసాదరావు, పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ, ఎంపిటిసి జి.రత్నకుమారి, ఆనందరావు, ఇఒపిఆర్‌డి కృష్ణారావు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని ధర్మపురం, దల్లిపేట గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, తహశీల్దార్ రాంబాబు, సర్పంచ్ మొదలవలస పాపారావు, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడాన సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రజలకు అందుబాటులో సేవలు అందించేందుకు సచివాలయం వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. తురకవీధి సచివాలయం ప్రాంగణంలో 5,6,11 వార్డులకు సంబంధించి నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల ధ్రువపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, తహశీల్దార్ గురుప్రసాద్, కౌన్సిలర్ మంజులత, బచ్చు జగన్, కౌన్సిలర్ ప్రతినిధులు షఫీ, కిరణ్‌కుమార్, ప్రకాష్ పట్నాయక్ పాల్గొన్నారు.

కవిటి: ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష అని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. మండలంలోని బెజ్జిపుట్టుగ, బొరివంక గ్రామాల్లో లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి, తహశీల్దార్ పి.శేఖర్, డిటి టి.రామచంద్రరావు, సర్పంచ్‌లు నారాయణస్వామి, దుగాన బద్రాచలం, బెందాలం శ్రీరామ్‌ప్రసాద్, వైస్ ఎంపిపి కర్రి గోపయ్య, ఎంపిటిసి దుద్ది సతీష్ పాల్గొన్నారు.

నందిగాం: దేవపురంలో మాజీ ఎంపిపి వై.చక్రవర్తి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు మండల స్పెషల్ ఆఫీసర్ మురళీకృష్ణ, తహశీల్దార్ పద్మావతి, మండల జెసిఎస్ కన్వీనర్ జడ్యాడ జయరాం, మండల పార్టీ అధ్యక్షులు తమిరి ఫాల్గుణరావు, సర్పంచ్‌లు కవిటి ఎర్రన్న, బొమ్మాలి గున్నయ్య, పోలాకి మోహనరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు.

మెళియాపుట్టి : జగనన్న సురక్షతో ప్రజలకు రక్ష అని ఎంపిడిఒ పి.చంద్రకుమారి అన్నారు. మండలంలోని ఇళయపురం సచివాలయంలో జనగన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా 77 వినతులు వచ్చాయని, అందులో 67 పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, డిటి శంకరరావు, సర్పంచ్ సిద్దిపాలెం గౌరీస్ పాల్గొన్నారు.



జి.సిగడాం : ధ్రువపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

కవిటి : ధ్రువపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కోటబొమ్మాళి: జగనన్న సురక్షతో లబ్ధిదారులకు మేలుచేకూరుతుందని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి దువ్వాడ వాణి, ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావులు అన్నారు. మండలం దంత సచివాలయం వద్ద ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మల అధ్యక్షతన జగనన్న సురక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఫ్యామిలీ, కుల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దుక్క రోజా, స్థానిక సర్పంచ్ గొండు చాందని మురళి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి, సంతబొమ్మాళి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్లు ఇన్‌చార్జి గడ్డవలస నాగభూషణరావు, సర్పంచ్‌లు కాళ్ల సంజీవరావు, బలగ సూర్యారావు పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న డిపిఎం రామ్మోహనరావు

ఆర్థికంగా బలోపేతం కావాలి

జలుమూరు: డ్వాక్రా సంఘాల్లోని మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని డిపిఎం చింతాడ రామ్మోహనరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో విఒఎలతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం వెలుగు కార్యాలయం ద్వారా డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. గ్రామ సమాఖ్య సంఘాలన్నీ ఎ-గ్రేడ్‌లో ఉండాలన్నారు. కార్యక్రమంలో స్త్రీనిధి ఎజిఎం సత్యనారాయణ, ఏరియా కో-ఆర్డినేటర్ కె.కొండలరావు, స్త్రీనిధి మేనేజర్ శ్రీనివాసరావు, ఎపిఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న స్వరూప్‌కుమార్

పోస్టల్ ఉద్యోగికి సన్మానం

ఇచ్ఛాపురం : ఇరవై నాలుగేళ్ల విశేష సేవలు అందించిన తపాలాశాఖ ఉద్యోగిని ఉలాసి దూదెమ్మను జెసిఐ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బుధవారం ఘనంగా సన్మానించారు. దుదెమ్మ సేవలకు అనేక అవార్డులు, సత్కారాలు అందుకున్నారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు స్వరూప్ కుమార్, సబ్‌పోస్టు మాస్టర్ భానుప్రకాష్, సంస్థ మాజీ అధ్యక్షులు జె.ఢిల్లేషు, కార్యదర్శి షణ్ముఖరావు, మహిళ్యా ప్రతినిధి పైడిశెట్టి స్నిగ్ధ తదితరులు పాల్గొన్నారు.

బీజామృతం తయారీ

రణస్థలం: మండలంలోని రావాడలో వరి విత్తనాలు విత్తన శుద్ధి కోసం 50 లీటర్లు బీజామృతం రైతులు బుధవారం తయారు చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ మాట్లాడుతూ ఎకరా వరి విత్తనాలు శుద్ధి కోసం 20 లీటర్లు నీరు, 5 లీటర్లు దేశీ ఆవుమూత్రం, 5 కేజీలు దేశీ ఆవు పేడ, వంద గ్రాములు సున్నం తీసుకొని 20 లీటర్ల నీటిలో 5 కేజీల పేడను పలసని గుడ్డతో కట్టి 12 గంటల పాటు వేలాడతీయాలన్నారు. తరువాత 5 లీటర్ల ఆవు మూత్రాన్ని ఆ నీటిలో కలపాలన్నారు. తర్వాత 50 గ్రాములు సున్నాన్ని ఃఅందులో వేసి 12 గంటల పాటు ఉంచిన తర్వాత బీజామృతం తయారవుతుందని తెలిపారు. ఈ విధంగా చేసిన బీజామృతం వరి విత్తనాలపై చల్లాలన్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి గంట్యాడ ఏసుబాబు, రమణమ్మ, సూర్యం, సుజాత పాల్గొన్నారు.

పాలనా అనుభవం లేక ప్రజలకు అవస్థలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనా అనుభవం లేని వ్యక్తి కావడం వల్లే నాలుగేళ్లగా ప్రజలు అవస్థల పాలవుతున్నారని టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు విమర్శించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబును వృద్ధుడని సంభోదించిన ఆయన చరిత్ర తెలుసుకోవాలని హితవుపలికారు. దేశంలో ప్రధాని మోడీ, చంద్రబాబు, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మమతా బెనర్జీ, ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అంతా ఏడుపదుల వయసున్న వారేనని అన్నారు. వారి పాలనా అనుభవం ప్రజలకు ఎంతో మేలు చేస్తోందని గుర్తుచేశారు. అటువంటి వ్యక్తుల విమర్శలు చేయడం వల్ల కుట్రబుద్ధి బయట పడుతుందన్నారు. ఈయనతో వెంట ఐటిడిపి జిల్లా అధ్యక్షుడు ప్రధాన విజయరాం ఉన్నారు.

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విత్తనశుద్ధితో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రకృతి వ్యవసాయ మండల యాంకర్ నక్క చిరంజీవిరావు అన్నారు. మండలంలోని తొగరాంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు చేత సామూహికంగా విత్తన శుద్ధి కార్యక్రమాన్ని బుధవారం చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి సేద్యంలో ప్రధానంగా నాలుగు చక్రాలు ఉంటాయని, అవి బీజామృతం, జీవామృతం, ఆచ్ఛాదన, వాప్సా అనే నాలుగు రథచక్రాలు కీలకమైనవని అన్నారు. కార్యక్రమంలో రైతులు వేణు, రమణ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : ప్రకృతి సేద్యంలో విత్తన శుద్ధి తప్పనిసరని మాస్టర్ ట్రైనర్ సూర్యనారాయణ అన్నారు. మండలంలోని రావివలసలో సర్పంచ్ వండాన కృష్ణ అధ్యక్షతన ప్రకృతి పద్ధతిలో ఘన జీవామృతం, బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేసి పొలంలో వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేసుకుంటే ఎటువంటి తెగుళ్లు, చీడపీడలు సోకకుండా పైరు ఆరోగ్యకరంగా ఉండి మంచి దిగుబడులు వస్తాయని అన్నారు. గ్రామంలోని రైతులు అందరూ విత్తనాలను విత్తన శుద్ధి చేసుకుని పొలంలో వేసుకోవాలన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటను సాగు చేస్తే మంచి దిగుబడిలు వస్తాయని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్2 డిజిటలేషన్ బొంగు లలిత, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ బి.శ్రీదేవి, టి.సుమ, బి.పూర్ణారావు, టి.తిరుపతిరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : విత్తన శుద్ధి చేస్తున్న రైతులు

కేక్‌ను తినిపిస్తున్న గొండు శంకర్

విలక్షణ నటుడు కళ్యాణ్‌రామ్

శ్రీకాకుళం అర్బన్ : తెలుగు చిత్రసీమలో విలక్షణమైన నటనతో, సాహసోపేతమైన పాత్రల్లో నటించి తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును నందమూరి కళ్యాణ్‌రామ్ తెచ్చుకున్నారని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. కళ్యాణ్‌రామ్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు దుంగ శ్రీధర్, బుర్రి మధుల ఆధ్వర్యాన నగరంలోని బెహరా మనోవికాస కేంద్రంలో బుధవారం కళ్యాణ్‌రామ్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి చిన్నారులకు పంచిపెట్టారు. చిన్నారులకు అల్పాహారం, మధ్యాహ్న బోజనం పెట్టి మామిడి పళ్లను అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, రెడ్డి గిరిజాశంకర్, కళ్యాణ రామ్ ఫ్యాన్స్ సెక్రెటరీ ముద్ద మధు, ఎఎంసి మాజీ డైరెక్టర్ బోల్ల నాగేంద్ర యాదవ్, రావుల గాంధీ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం కోసం ఆర్థికసాయం

ఆర్థికసాయం అందజేస్తున్న దుర్గారావు

లావేరు : మండలంలోని గుమ్మాడంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు యువకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ విగ్రహ నిర్మాణానికి మాజీ సర్పంచ్ దుర్ఘాశి ధర్మారావు తనవంతు సహాయంగా కమిటీ సభ్యులు టి.నర్సింగరావుకు రూ.20 వేలు ఆర్థికసాయం బుధవారం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ భవిషత్‌లో ఎటువంటి సహాయ, సహకారాలు కావాలన్నా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు మీసాల నాగరాజు, రేగడి లక్ష్మణ పాల్గొన్నారు.